

# క రాజు కథలు

## - సింగీతం శ్రీనివాసరావు



### నా మాట

అపుడెపుడో - కాలేజీల కాలం. ఖాసా సుబ్బారావుగారు, గోరా శాస్త్రిగార్ల ప్రోత్సాహంతో భారతి, స్వతంత్రలాంటి పత్రికల్లో కొంతకాలం నా రచనా కేళి సాగింది. ఆనాడు రాసిన "అంత్యఘట్టం" నాటికను ఇప్పుడు కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయంలాంటి చోట్ల ప్రదర్శిస్తున్నారంటే అదో తృప్తి. ఆ రోజుల్లోనే టంగుటూరి సూర్యకుమారిగారు నటించి, ప్రదర్శించిన 'చిత్రార్జున' నాటకం పాటలతో సహా రాశాను. ఈ ప్రదర్శనను పండిత జవహర్ లాల్ నెహ్రూగారు ఢిల్లీలో చూశారు. ఆ తర్వాత టామ్ బకన్ అనే స్కాట్లండ్ రచయిత దీనిని ఇంగ్లీషులో తర్జుమా చేస్తే, దీన్ని అమెరికాలో తెలుగు పాటలతో ప్రదర్శించారు. ఈ తర్వాత నేను పెద్దగా రాసిందేది లేదు. "మీ సినిమాలకి మీరే మాటలు రాస్తే బాగుంటుంది" అని జంధ్యాలగారు చాలాసార్లు చెప్పారు. ఆయన మాటల్ని కాదనలేక పుష్పక విమానం తీశాను. "మీరు పాటలు రాయండి" అంటూ వేటూరిగారు ఎప్పుడూ ప్రోత్సహిస్తూ వుండేవారు. 'భైరవద్వీపం'లో ఒకపాట ఆయన రాయాల్సుంది. ఎన్నాళ్ళకూ ఆయన దర్శనం లభించకపోయేసరికి గత్యంతరం లేక నేనే "విరిసినది వసంతగానం" పాట రాశాను. ఆ పాట బాగా రాశానని వేటూరిగారు మెచ్చుకోవడం నాకొచ్చిన పెద్ద అవార్డు.

మళ్ళీ ఇన్నాళ్ళకు కాలేజి రోజుల ఉత్సాహం మళ్ళీ పుట్టుకొచ్చింది. ఆ రోజుల్లో పింగళి నాగేంద్రరావుగారు నా చేత స్క్రిప్టు ఒక రఫ్ వర్షన్ సీన్లు రాయించేవారు. వాటిల్లోంచి ఎన్నో ఐడియాలూ, శ్రీకృష్ణార్జునయుద్ధంలో అర్జునుడి పేరు 'అజిభీధఫపావిశ్వేసకి' లాంటివి ఎన్నో వచ్చేవి. ఇంట్లో వాటిని ఫెయిర్ కాపీ చేసే పని నా అర్ధాంగి కల్యాణిది. మళ్ళీ ఆ రోజులు గుర్తొచ్చేలా ఈ కథల్ని కల్యాణే ఫెయిర్ కాపీ చేసింది. ఈ కథల్ని ఆనందిస్తూ - "ఎంజాయ్" చేస్తూ అంటే కరెక్ట్‌గా చెప్పామనిపిస్తుంది - రాశాను. చదివిన వాళ్ళూ ఎంతో కొంత ఎంజాయ్ చేస్తే మరింత ఆనందిస్తాను.

*సింగీతం శ్రీనివాసరావు*

మిత్రులు సింగీతం శ్రీనివాసరావుగారికి నాకూ కనీసం 50 ఏళ్ళ పరిచయం. ఆయన భారతికి 'అంత్యఘట్టం' రాసే రోజుల్లో నేనూ భారతికి రాస్తున్నాను. దరిమిలాను ఆయన సినిమా రంగంలో స్థిరపడిన తర్వాత యిద్దరం కలిసి చాలా సినిమాల్లో పనిచేశాం. ఆయన దర్శకత్వం, వహించిన సినిమాలకు నేను రచన చేశాను. ఆయన దర్శకత్వంలో నేను నటుడిగా పనిచేశాను. ఈ రెండూ చెయ్యకపోయినా ఆయన తీసే అన్ని సినిమాల కథలూ ముందుగా నాకు చెప్పి నాతో చర్చించడం ఒక ఆనవాయితీ. నాకు వారి నాన్నగారు రామచంద్రరావుగారు తెలుసు. ఈ విషయాన్ని ఇంత విపులంగా, ముందు చెప్పడానికి కారణం - ఆయన సెన్సాఫ్ హ్యూమర్‌తో నాకు అయిదు దశాబ్దాల బంధుత్వం ఉన్నదని చెప్పడానికి.

'ఆదిత్య 369'లో నేను, టినూ ఆనంద్, అమ్రేష్‌పురీ నటిస్తున్నాం. మరొకరెవరో గుర్తులేదు. వాళ్ళ చెవులకి వైర్లు బిగించి - భయంకరంగా వయొలిన్లు వాయించే ఏర్పాట్లు చేశారు. ఆ శబ్దాలకి వారి చెవుల్లోంచి రక్తం కారుతుంది. నా చేత ఒక డైలాగ్ చెప్పించారు శ్రీనివాసరావుగారు. నా బాస్ అమ్రేష్‌పురీతో అంటాను. "బాస్, మీరు చాలా గొప్పవారు. వయోలిన్స్ ద్వారా అద్భుతమైన 'వయొలెన్స్'ని సృష్టించగలుగుతున్నారు" అని. ఇది ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా గిలిగింతలు పెట్టినట్టు నవ్వుకుంటాను.

శ్రీనివాసరావుగారు రాసిన కథల్ని చదవడం ఇదే మొదటిసారి. చదివాక - మొదట నిర్ఘాంతపోయాను. కారణం మెల్లగా చెబుతాను. అవి చిన్నపిల్లల కథల్లాగ అతి సరళంగా, అమాయకంగా చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న పసివాడిలాగా నడిపించుకుపోయాయి. మంచి కథకి అది మొదటి, గొప్ప లక్షణం.

కాగా, మంచి భాష నేర్పేవాడు భాష శాస్త్రికావడం, బాగా పాడేవాడు తాలం బ్రహ్మయ్య, శివ భక్తుడు కాశీ విశ్వేశ్వరయ్య కావడం, దుర్మార్గులు కోరమీసాల కోటయ్య, మిడిగుడ్ల సిద్ధయ్య కావడం - యివన్నీ చిన్నపిల్లల కథలకి ఏమి తికమకలు లేని Stylisation. ఇక్కడితో ఈ కథలకి సంబంధించిన చిన్నపిల్లల ముద్ర ఆగిపోతుంది. చదివించే గొప్ప గుణాన్ని వాక్యాల, పేర్ల సన్నివేశాలతో సాధించారని చెప్పడమే నా ఉద్దేశం. అయితే వీటికి కేవలం చదివించే గుణం మాత్రమే ఉన్నదని సరిపెట్టుకోవడానికి వీలులేదు. లోకధర్మాన్నీ, లోకం తీరునీ, సమాజ స్వరూపాన్నీ అతి సునిశితంగా, కాని సున్నితంగా వెక్కిరించే - అది కేవలం వెక్కిరింత మాత్రమే కాదని అనిపించే సెన్సాఫ్ హ్యూమర్‌ని జతచేశారు. అదీ ఈ కథల్లో రచయిత సాధించినది.

సరళంగా చదివించి, సరసంగా నవ్వించి, 'అమ్మో!' అని తుళ్ళిపడేటట్టు చేసి సమాజంలోని వైపరీత్యానికి కనుబొమ్మలు ముడివేయడమో, కత్తులు నూరడమోకాక, నవ్వుతూ గాటుపెట్టే అందమయిన ఆయుధాన్ని సానబెట్టారు రచయిత ఈ కథల్లో. ఈ ధోరణిలో మార్క్‌ట్వెయిన్, భమిడిపాటి కామేశ్వరరావు వంటి రచయితల్ని స్పురణకు తెస్తారు రచయిత. అసలు ఏ రచయితయినా సమాజంలో అవకతవకల్ని చూసి కళ్ళెర్రజేయడం అతని పరిధిని దాటడం అనిపిస్తుంది నాకు. కానీ వ్యగ్రతల్ని చూపి నవ్విస్తూ వాటిని పాఠకుడి స్పృహలోకి తీసుకురావడం రచయిత పరిమితిగా నేను నమ్ముతాను. No Social Problem can be solved by any writer on paper. He can only create the consciousness. హాస్యం ఆ అపశృతిని ఫోకస్‌లోకి తెస్తుంది. ఆలోచించేట్టు చేస్తుంది. అంతవరకే రచయిత పని. తరువాత ఏ పనిని చేపట్టినా అది తనదికాని పనిని నెత్తిన వేసుకోవడమే అవుతుంది.

కొట్టండి చంపండి అనేవాడికంటే, అవినీతిని నవ్వుతూ అలంకరించి, కితకితలు పెట్టే రచయిత మంచి హెచ్చరికని చేయగలుగుతాడని నేను నమ్ముతాను. ఆ పనిని చాలా బాధ్యతగా, గంభీరంగా, ప్రొఫెషనల్‌గా, తనకి వారసత్వంగా వచ్చిన సెన్సాఫ్ హ్యూమర్‌తో ప్రతీ కథలోనూ చేసి చూపించారు.

హాస్యానికి అద్భుతమైన పదును ధ్వని. కేవలం నవ్వించే హాస్యం - వెకిలిగానూ, కొండకచో వెగటుగానూ ఉండవచ్చు. కానీ సమాజశీలాన్ని చిన్న గాటుతో ఉలిక్కిపడేటట్టు చేయడం ఆరోగ్యకరమైన ఉత్తమ హాస్యం లక్షణం. వెకిలి 'ధ్వనుల'ను రాబట్టే చాలామంది రచయితలు మనకున్నారు. అర్థంలేని 'పన్'లను వాడి కంపు కొట్టించే ఘనులున్నారు. నాకు వీరందరి మధ్యా సింగీతం ప్రత్యేకంగా, విభిన్నంగా దర్శనమిస్తారు. ఈ మాట చెప్తున్నప్పుడు నా మనస్సులో మార్క్‌ట్వెయిన్ ఉన్నారు.

ఆయన ఎప్పుడో ఇండియా వచ్చారట. దక్షిణాదిన చాకలి బండమీద బట్టలు ఉతకడం చూశారట. "ఆహా! ఒక్క భారతదేశంలోనే బట్టల్తో బండల్ని బద్దలు కొట్టే విచిత్రాన్ని చూశాను" అన్నారట.

హాస్యానికి వింతకోణం, సంధించగలిగితే వింత పదునూ, సమర్థుడి చేతుల్లో వింత అస్త్రమూ కాగలదు. ఈ పనులన్నీ చేయగల నిష్ణాతుడు సింగీతం శ్రీనివాసరావు. చేసి చూపిన వేదిక - "క రాజు కథలు."

*గొల్లపూడి మారుతీరావు.*

# వేషాల భాష

**మనుష్యుల్లో దేవుళ్ళూ ఉన్నారు** దానవులూ ఉన్నారు. కానీ వారిని గుర్తించేదెలా? పురాణాల్లో ఎవరు ఎవరన్నది స్పష్టంగా రాసుంది. కానీ రోజూ కనిపించేవారిలో ఆ తేడా తెలుసుకోవడం ఎలా? సామాన్య పౌరునికయితే ఇది తెలుసుకోవడం అనవసరం. కానీ మంత్రి స్థానంలో ఉన్న వారికి అలా కుదరదుగా! అందుకనే మంత్రిగారికి కొందరి వ్యక్తుల స్వభావాలవల్ల రాచకార్య నిర్వహణలో కొన్ని సమస్యలు ఎదురౌతాయి. అలాంటి సమస్య ఒకటి ఇప్పుడు మంత్రిగారి నెత్తిమీద పడింది.

నగరంలోని తూర్పుపేటలో నివసించే వారిలో రెండు తెగలు. ఒక తెగకు పెద్ద కోరమీసాల కోటయ్య. మరొకదానికి మిడిగుడ్ల సిద్ధయ్య. పేటలో వీరినెవరు చూసినా దడుసుకుంటారు. మామూలుగా కలుసుకున్నప్పుడు ఇద్దరూ చిరకాల మిత్రుల్లా ఒకరిమీద ఒకరు ఛలోక్తులు విసురుకుంటారు. అందరి తోను సరదాగానే ఉంటారు. దీనికి ఒక కారణం ఉంది. వీళ్ళిద్దరికీ నాటకాలాడించడం, ముఖ్యంగా ఆ నాటకాలలో నటించడంలో ఒక తనివి తీరని మమకారం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఒక రకమయిన ఉన్మాదం.

ముఖ్యంగా రావణాసురుడి పాత్రలో ఇద్దరూ అద్వితీయులెలా ఉంటారు? అందుకే ఎవరికి వారు తామే అద్వితీయులమని చాటుకుంటారు. ఈ మాట ఎవరు కాదన్నా వారికి ఆగ్రహం వస్తుంది. పద్యాలు పాడడంలో సిద్ధయ్యే మేటి అని ఎవడైనా అంటే కోటయ్య వాడి పీక పిసికేస్తాడు. రాక్షసత్వాన్ని ప్రదర్శించడంలో కోటయ్యదే పైచెయ్యని ఎవడైనా అంటే సిద్ధయ్య చేతిలో వాడి బొచ్చె బద్దలు కావాల్సిందే ఈ ఒక్క విషయంలో మాత్రం ఇద్దరికీ సహించరాని వైరం. కొద్దిరోజులలో ఊళ్ళో నవరాత్రి సంబరాలు మొదలౌతాయి. ప్రతి సంవత్సరం దుర్గాష్టమినాడు రాత్రి ఏదో ఒక నాటకం ప్రదర్శించడం సంప్రదాయం. అలాగే ఈ దుర్గాష్టమి రోజు రాత్రి రామాయణ నాటకం వేయించి అందులో రావణాసురుడి పాత్రను వేయాలని సంకల్పించాడు కోటయ్య. ఇదే సమయంలో ఇదే సంకల్పం సిద్ధయ్యకూ వచ్చింది. కోటకు ఆనుకుని ఉన్న మైదానంలో భారీగా ఒక రంగస్థలాన్ని నిర్మించి అందులో నాటకం వెయ్యాలనుకున్నాడు కోటయ్య, సిద్ధయ్య కూడా ఇలాగే అనుకున్నాడు. తనకొచ్చిన ఈ ఆలోచన రహస్యంగా ఉంచాలనుకున్నాడు. కోటయ్య కూడా అంతా రహస్యంగానే ఉంచాలనుకున్నాడు.

మైదానంలో నాటకాలు గానీ, క్రీడలు గానీ వేరే ఎలాంటి వినోద ప్రదర్శనలు జరిపించాలనుకున్నా దానికి అనుమతి ఇవ్వవలసినది ఇద్దరు. ఒకరు మైదానాధికారి. మరొకరు వినోదాధికారి. ఈ ఇద్దరిలో ఏ ఒక్కరు అనుమతి ఇచ్చినా చాలు.

ఒక మంచి ముహూర్తం చూసుకుని కోటయ్య తన అనుచరులతో రహస్యంగా వినోదాధికారి దగ్గరకు వెళ్ళాడు. అదే సుముహూర్తంలో సిద్ధయ్య కూడా రహస్యంగా మైదానాధికారి దగ్గరకు వెళ్ళాడు. ఒకరికి తెలియకుండా ఒకరు నాటకం ఆడటానికి అనుమతి తీసుకున్నారు. చివరకు ఆ సాయంత్రం ఇద్దరూ ఊరంతా తాము వేయబోయే నాటకాలను గూర్చి ప్రచారం చేసే సమయంలో జరిగిన విషయం ఇద్దరికీ తెలిసివచ్చింది. ఒకే సమయంలో ఒకే మైదానంలో ఇద్దరు ప్రత్యర్థులు అదే నాటకాన్ని వేస్తున్నారన్న వార్త అందరిలో కుతూహలాన్ని రేపింది. కోటయ్య, సిద్ధయ్యలు మాత్రం ఈ పరిస్థితిలో విపరీతమైన ఆందోళనకు గురి అయ్యారు. ఇద్దరూ మళ్ళీ మైదాన వినోదాధికారులను కలుసుకుని, అనుమతిని ముందు మేం కోరాం అంటే మేం కోరాం అంటూ వాదించుకుని, అది తమకే ఇవ్వాలని అడిగారు. ఇలాంటి ఇబ్బందికరమైన పరిస్థితి అధికారులకింతకు ముందెన్నడూ రాలేదు. అయినా వాళ్ళిద్దరూ మిత్రులు. పైగా తోడళ్ళుళ్ళు కూడా. వారిలో ఏదైనా అభిప్రాయభేదాలొస్తే, అది కుటుంబంలో ఎటువంటి విషమ పరిణామాలకు దారితీస్తుందో వారికి తెలుసు. అందుకని వాళ్ళిద్దరూ కూడబలుక్కుని, "మేము ఇద్దరికీ అనుమతి ఇచ్చాము. ఎవరు నాటకం వెయ్యాలో, ఎవరు వెయ్యకూడదో మీలో మేరే నిర్ణయించుకోండి" అన్నారు.

ఒక శాంతి నిర్ణయానికి వచ్చే స్థితిలో కోటయ్య, సిద్ధయ్యలేరు. ఆరునూరైనా సరే నేనే రావణాసురుణ్ణని ఇద్దరూ శపథం చేశారు. వెంటనే నాటక ప్రదర్శనకు కావలసిన ఏర్పాట్లు చేయించాల్సిందిగా అనుచరులకు అనుమతిచ్చారు. రెండు రంగస్థలాల నిర్మాణం మొదలయింది. ఒకరు మైదానానికి ఉత్తరాన కడ్తాంటే, మరొకరు దక్షిణాన కట్టడం మొదలుపెట్టారు. మధ్యలో కూర్చున్న జనం మావైపుకు తిరిగి చూస్తారని ఒకరంటే, కాదు మావైపే తిరిగి చూస్తారని మరొకరు గొప్పలు చెప్పుకున్నారు. ఈ సమస్య ఎలా తేల్తుందో చూడాలని అందరూ ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఇద్దరు రావణాసురులను ఒకేసారి చూసే సమయం కోసం కాచుకుని ఉన్నారు.

ఇరువర్గాల వారి ప్రచారాలు తీవ్రస్థాయినందుకున్నాయి. కానీ ఘడియలు గడిచే కొద్దీ ఇద్దరు రావణాసురులలో ఒక రకమయిన భయంకూడా ఉత్పన్నమయింది. చూడ్డానికి, వచ్చిన జనం ఒకవేళ ఎదటివాడే మెరుగు అంటే? అది భరించలేని అవమానం. అలాంటి పరిస్థితికి అవకాశం ఇవ్వకూడదు. అందుకుగాను ఇద్దరూ వారి వారి అనుచరులను పిలిచి వాళ్ళు చెయ్యవలసిన పనులను విశదీకరించారు.

"మీరందరూ నాటకం జరుగుతున్నంతసేపూ నాటకాన్ని చూడకూడదు. జనాన్నే చూడాలి. జనం మనల్నే చూస్తుండాలి. అటు తిరిగారో, వెంటనే కర్రలతో తల పగిలేలా ఒకటెయ్యండి. అంతకంటే ముఖ్యం పేటలోని వారంతా నాటకానికి రావాలి. కాదన్నారో, - మీ పని అదే కర్ర - తల పగలగొట్టడం" అనుచరులకు చేతనయిన పనికూడా అదొక్కటే గనక వారికిచ్చిన బాధ్యతను సంతోషంగా స్వీకరించారు.

ఏదో తమాషా చూద్దాం అనుకున్న జనానికి ఈ మాట వినగానే భయం పట్టుకుంది. "ఎందుకొచ్చిన నవరాత్రి సంబరాలు? ఏమిటా రావణాసుర బాధలు?" అనుకున్నారు. రేపు రాత్రికే నాటకం. ఇప్పుడూరుకుంటే పరిస్థితులు విషమిస్తాయనే భయంతో పేటలోని కొందరు పౌరులు రహస్యంగా మంత్రిగారి ఇంటికి వెళ్ళారు. ఉన్న విషయాన్ని ఆయనకు సవివరంగా విన్నవించుకున్నారు. "మంత్రిగారూ! ఈ క్లిష్టపరిస్థితిలోంచి మమ్మల్ని మీరే కాపాడాలి. నాటకానికి వెళ్ళకపోతే కొట్తానంటున్నారు. వెళ్ళి అటు చూస్తే వీళ్ళు కొట్తారు. ఇటు చూస్తే వాళ్ళు కొట్తారు ఎటూ చూడకుండా దేవుడా అంటూ పైకి చూస్తే ఇద్దరూ కొట్తారు. ఎలాగైనా ఆ నాటక ప్రదర్శనలను మీరు నిషేధించాలి" అన్నారు. మంత్రి గాంభీర్యంగా తల ఊపి, "మీరు వెళ్ళండి నేను చూస్తాను" అని ముక్తసరిగా చెప్పి వాళ్ళను పంపించాడు. పైకి గంభీరంగా కనిపించినా ఇందులో సాధక బాధకాలు మంత్రికి తెలుసు. కోటయ్య, సిద్ధయ్యలు మొండివాళ్ళు. వాళ్ళ పేర్లు నిలబెట్టుకోడానికి ఎంతకైనా సాహిసిస్తారు. ఇప్పుడెలా? వర్షం వస్తే బాగుండుననుకున్నాడు. కానీ ఆకాశం చూస్తే సూచనలెక్కడా కనిపించడంలేదు. పరిస్థితులెదురయినప్పుడు అతనికి తెలిసింది ఒక్కటే. వెళ్ళి క రాజు గారికి మొత్తం విన్నవించుకోడం.

"ఏం మంత్రీ! తూర్పుపేటలో పరిస్థితి బాగా వేడెక్కినట్టుంది?" అనడిగాడు క రాజు మంత్రి చెప్పడానికి ముందే రాజుగారు అన్ని విషయాలు ఎలా తెలుసుకుంటాడా అని ఆశ్చర్యపోయాడు మంత్రి.

"అవును మహారాజా! గొడవలు జరక్కుండా ఉండాలంటే మీరా నాటకాలను నిషేధించాలి. రాజాజ్ఞను ఎవ్వరూ ఉల్లంఘించలేరు కదా?" అన్నాడు మంత్రి.

"ఉల్లంఘించలేరు కదా అని అవసరం ఉన్న లేకున్నా రాజాజ్ఞ ఇవ్వడం సమంజసం కాదు మంత్రీ. పైగా ప్రతి దుర్గాష్టమి నాడు వేసే నాటకాలు ఈ ఏడు వెయ్యలేదంటే అది రాజ్యానికి అప్రతిష్ట."

"మరిప్పుడు ఏం చెయ్యమంటారు మహారాజా, ఒకేచోట రావణాసురుడి పాత్ర వెయ్యడానికి ఇద్దరు ముందుకొస్తుంటే" అన్నాడు మంత్రి.

"మంత్రీ! రావణాసురుడి పాత్ర వెయ్యడానికి ముఖ్యంగా కావలసిందేది?" మంత్రి అర్థంకాక చూశాడు.

"అతని తలలు. అవి చేసేవాడు ఈ ఊళ్ళో ఒక్కడే ఉన్నాడు. అతనే తలల పెదతాత. మీరు వెళ్ళి, రాత్రి రహస్యంగా పెదతాతను కలవండి. ఒకే ఒక రావణాసురుడికి సరిపోయే తలల్ని మాత్రం ఇంట్లో ఉంచి, అతన్ని ఈ రాత్రికే ఊరువిడిచి వెళ్ళమనండి. సమస్య దానికదే సర్దుకుపోతుంది" అన్నాడు క రాజు.

తలల పెదతాత ఇల్లంతా నాటకాల దుస్తులూ, కిరీటాలు, కత్తులువంటి వాటితో నిండివుంది. పెదతాత ఒక మూల కూర్చుని ఏదో పనిలో నిమగ్నుడై ఉన్నాడు. మంత్రిగారు రాగానే నిలబడి నమస్కరించాడు. రావణాసురుడి తలల గురించి మంత్రి అడిగాడు.

"అదిగోనండి - తొమ్మిది తలలు సిద్ధంగానే ఉన్నాయి" అన్నాడు పెదతాత.

"అదేమిటయ్యా, రావణాసురుడికి పదితలలు కదా?"

"అవునండి. వేషం వేసే వాడి తల ఒకటుందిగా! మిగతా తొమ్మిది తలలూ అటు అయిదు ఇటు నాలుగు తగిలించుకుంటే సరిపోతుంది.

ఈ మాత్రం ఆలోచించలేకపోయానే అనుకున్నాడు మంత్రి. పెదతాతతో రహస్యంగా "చూడు పెదతాతా! నీవీ తలల పని ఇంతటితో ఆపు" అన్నాడు.

"మరొక తొమ్మిది తలలు -" ఏదో చెప్పబోయాడు పెదతాత.

"అక్కర్లేదు. ఈ తొమ్మిది తలలు మాత్రం ఇక్కడుంచు. ఈ పైకం తీసుకుని ఈ రాత్రికే ఎవ్వరికీ చెప్పకుండా ఊరువిడిచి వెళ్ళు. వారం అయిన తర్వాత రా. ఎందుకు అని అడక్కు. ఇది రాజాజ్ఞ" అన్నాడు మంత్రి.

పెదతాత తను లేనపుడు చేయవలసిన పనులన్నీ తన మనవడికి అప్పచెప్పి ఎవరైనా అడిగితే దుస్తులూ, నగలతోపాటు ఈ తొమ్మిది తలలే ఉన్నాయని చెప్పమని చెప్పి అర్ధరాత్రయ్యేసరికి అదృశ్యుడయ్యాడు.

కోటయ్య, సిద్ధయ్యలు ఎంతసేపూ తమ తగాదా ధ్యాసలో ఉన్నారేగాని, తలల గురించిన ఆలోచన వాళ్ళకు రాలేదు. అది ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందనే ధీమా కూడా. ఉదయం, అయ్యేసరికి ఇద్దరు రావణాసురులకు కలిపి తొమ్మిది తలలే సిద్ధంగా ఉన్నాయన్న నిజం ఇరువైపుల వారికి తెలిసింది. దాంతో అందరూ పెదతాత ఇంట్లోకి దూరి ఆ తలలు మావంటా మావి అనుకుంటూ తలల్ని పట్టుకుని చెరొకవైపు లాక్కోవడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో తొమ్మిది తలలూ రెండు భాగాలై కోటయ్యకు అయిదు తలలు, సిద్ధయ్యకు నాలుగు తలలూ దక్కాయి.

ఈ పరిస్థితిలో ఏం చెయ్యాలో కోటయ్య, సిద్ధయ్యలకిద్దరికీ అర్థం కాలేదు. రాజ్య సాంప్రదాయ ప్రకారం దుర్గాష్టమి రాత్రి నాటకం వేసే పూచీ వాళ్ళదే వీళ్ళు సందిగ్ధంలో ఉండగా ఈ వార్త అలా అలా ప్రాకి చివరకు రాజుగారి చెవిన పడింది. అది విన్న రాజు మంత్రి ద్వారా ఒక సలహా పంపించాడు. అది ఒక వార్తాహరుడి ద్వారా కోటయ్య సిద్ధయ్యలకు తెలిసింది. ఇది సలహా అని చెప్పినా, రాజుగారి సలహా గనక ఆజ్ఞ అవుతుంది కదా! ఆ సలహా ఇలా ఉంది.

'కోటయ్య, సిద్ధయ్యలిద్దరూ సంప్రదాయాన్ని నిలబెడ్తూ దుర్గాష్టమి నాడు నాటకాలాడాలని నిశ్చయించడం సంతోషించదగ్గ విషయమే, కానీ వాళ్ళు రావణాసురుడి పాత్ర వెయ్యాలని సంకల్పించినా, దైవసంకల్పం వలన ఒకరికి అయిదు తలలూ, ఒకరికి నాలుగు తలలూ దక్కడంతో ఆ పాత్రల ప్రదర్శనకు అంతరాయం కలిగింది. కానీ వారిచ్చిన మాట ప్రకారం ఒక నాటకం, ఏదైనా సరే, ప్రదర్శిస్తేనే శ్రేయస్కరం. లేకుంటే ఈ రాజ్యంలో ప్రజలు తాము అనుకున్నది చెయ్యలేదనే అప్రతిష్ఠ వస్తుంది.

అందుకని అయిదు తలలు దక్కిన కోటయ్య, తన తలను జతచేసి షణ్ముఖుడైన సుబ్రహ్మణ్యస్వామి పాత్రను, అదే విధంగా సిద్ధయ్య తన దగ్గరున్న నాలుగు తలలూ తన తలకు జోడించి, పంచముఖ ఆంజనేయస్వామి పాత్రనూ ధరించవలసింది., ఇందుకుగాను

ఆయా తలలో చేయవలసిన రంగు మార్పులను చేసి, శుభప్రదంగా నవరాత్రి సంబరాలను కొనసాగించవలసింది. ఇద్దరూ నటనానుభవం కలవారు గనుక ఇది సుసాధ్యం.

రాజాజ్ఞ పాటించడానికి ఇద్దరూ ఉద్యుక్తులయ్యారు. జనం కుతూహలంగా చూస్తూండగా ఒక వేదిక మీద సుబ్రహ్మణ్యస్వామి, మరొక వేదిక మీద ఆంజనేయస్వామి కనిపించడంతో అందరిలో ఒక నూతన భక్తిభావం పుట్టుకొచ్చింది. కోటయ్య సిద్ధయ్యలు వారికొచ్చిన కొత్తపాత్రల్లో లీనమయి నటిస్తుంటే, అటూ ఇటూ రెండు వైపులా చూస్తున్న జనంలో భక్తి ఆవేశంగా మారింది. నాటకం అయ్యేసరికి అందరూ ఇద్దరు దేవుళ్ళకు కర్పూరం వెలిగించి హారతులు పట్టారు. ఇన్నాళ్ళూ తమను చూసి భయపడిన జనం, ఇప్పుడు హారతులిస్తుంటే, కోటయ్య, సిద్ధయ్యలకు కొత్తగా, ఆనందంగా ఉంది. ఇకనుంచీ రాక్షసుల పాత్రలూ కాదు, దేవుళ్ళ పాత్రలే వెయ్యాలని కొత్తరూపాల్నే ప్రజలు తమ దృక్పథంలో సంతరించుకున్నారు. ఒకప్పుడు దానవుల్లాగా కనిపించిన వ్యక్తులు ఇప్పుడు దేవుళ్ళలాగా కనిపిస్తున్నారు.

ఈ శుభపరిణామాలను గురించి ఏకాంత మందిరంలో క రాజుతో చర్చిస్తున్న మంత్రిని చూసి, "చూసారా మంత్రీ! ఒక వ్యక్తి ఇలాంటి వాడని ప్రజలు నిర్ణయించేది అతని స్వభావం వల్ల కాదు. అతను వేసే వేషం వల్ల" అన్నాడు క రాజు చిరునవ్వుతో.

*(ఈ కథలన్నీ గతంలో హాసం పత్రికలో ప్రచురించబడ్డాయి. అంతర్జాతీయంగా ఉన్న*
*తెలుగువారందరికి చేరాలన్న ఉద్దేశంతో రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రిస్తున్నాము )*

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments